శునకాలు పీకేస్తున్నాయ్!

- రోడ్లపై గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు
- ప్రజలపై దాడులకు పాల్పడుతున్న వైనం

ఇచ్ఛాపురం: కుక్కలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. దాడులకు పాల్పడుతూ తీవ్రంగా గాయపరుస్తున్నాయి. వాహనాలపై వెళ్లేవారి వెంట పడుతూ కాలు పీకేస్తున్నాయి. ఈ పరిస్థితి ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో అధికంగా ఉంది. రాత్రి, పగలనే తేడాలేకుండా గుంపులుగా తిరుగుతూ బెంబేలెత్తిస్తున్నాయి. పట్టణంలోని ఏ వీధిలో చూసిన శునకాలు స్వైర విహారం చేస్తున్నాయి. వీధిలతోపాటు హోటళ్లు, టిఫిన్ షాపులు, చికెన్, మటన్ దుకాణాల వద్ద తిష్ఠ వేస్తూ అక్కడికి వచ్చేవారిపై దాడి చేస్తున్నాయి. బజారువీధి, రథం వీధి, ఉప్పలవీధి, బ్రాహ్మణవీధి, హాస్పిటల్‌రోడ్, ఫకీర్‌పేట, గొల్లవీధి, గాంధీపార్కు వీధి, బెల్లుపడ కాలనీ, డబ్బూరువీధి, ఉప్పలవీది కూడలి, స్వేచ్ఛావతి అమ్మవారి వీధి, కంద్రవీధి, గిలాయివీధి కూడలి, పురుషోత్తపురం, అమీన్‌సాహెబ్ పేట, రత్తకన్నలో వీటి బెడద ఎక్కువగా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. కార్యాలయాలు, స్కూళ్లు, కాలేజీలకు వెళ్లేవారు కుక్కల బారిన ఎక్కువగా పడుతున్నారు. వాహనాల వెంట పరుగులు తీస్తుండంతో వీటిబారినుంచి తప్పించుకునే క్రమంలో చాలామంది అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. నడిచివెళ్లేవారిపై దాడి చేస్తూ కాళ్ల పిక్కలను పీకేస్తున్నాయి. దీంతో ఒంటరిగా వెళ్లేందుకు ఎవరూ సాహసం చేయడం లేదు.



రోడ్లపై గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

రెండు వేల కుక్కలు..

మున్సిపల్ అధికారుల లెక్కల ప్రకారం పట్టణంలోని 23 వార్డులలో రెండువేలకు పైగా వీధి కుక్కలున్నట్లు అంచనా. వీధి కుక్కల నియంత్రణకు అవసరమయ్యే చర్యలు అంతంతమాత్రంగానే జరుగుతున్నాయి. వీటి సంతానం వృద్ధి చెందకుండా ప్రత్యేక డ్రైవ్ చేపట్టినప్పటికీ అనుకున్నంత ఫలితాలు కనపడడంలేదు. గడచిన ఆరు నెలల క్రితం మున్సిపల్ అధికారులు వీధికుక్కల నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టినప్పటికి వీటి సంతతి ఎక్కువగానే ఉందని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైన కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకొని వాటిబారి నుంచి రక్షించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

వాహనదారులపై దాడి చేస్తున్నాయి



ద్విచక్ర వాహనాలు, సైకిళ్లపై వెళ్లే సమయంలో గుంపులుగా సంచరించే కుక్కలు ఒక్కసారిగా వెంబడించి దాడి చేసి కాలుపీకేస్తున్నాయి. ఈ క్రమంలో చాలా మంది అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. పిల్లలు, వృద్ధులు ఒంటరిగా బయటకు రావడానికి భయపడుతున్నారు. మున్సిపల్ అధికారులు వీటి నియంత్రణకు అవసరమయ్యే చర్యలు తీసుకోవాలి.

–చాట్ల తిరుపతి, పురుషోత్తపురం

గుంపులుగా సంచరిస్తున్నాయి



పట్టణంలోని మెయిన్ రోడ్డు, ఆస్పత్రి రోడ్డులో 20 నుంచి 30 కుక్కలు గుంపుగా సంచరిస్తున్నాయి. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, పనులపై వెళ్లే వారిపై దాడులు చేస్తున్నాయి. ఎవరైన కొత్తవారు వీధుల్లో నడిచి వెళ్లే వారిని వెంబడించి గాయపరుస్తున్నాయి. రాత్రి వేళలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంటుంది.

–కె.రమేష్, ఇచ్ఛాపురం

నియంత్రణ చర్యలు చేపడుతున్నాం



ఇచ్ఛాపురం పట్టణంలో కుక్కల నియంత్రణకు చర్యలు చేపడుతున్నాం. ఇందులో భాగంగా వాటిని పట్టుకొని సంతానం వృద్ధి కాకుండా వెటర్నరీ వైద్యులచే ఆపరేషన్లు చేయించడం, యాంటీబయాటిక్ వ్యాక్సినేషన్లు వేయిస్తున్నాం. ఈ విధంగా 850 కుక్కలకు ఆపరేషన్లు చేయించాం. కుక్కలు జనంపై దాడి చేస్తున్న ఘటనలు మాదృష్టికి వచ్చాయి. గాయపడినవారిలో మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది కూడా ఉన్నారు. ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

–ఎన్.రమేష్,
మున్సిపల్ కమిషనర్, ఇచ్ఛాపురం

క్లుప్తంగా

పీజీఆర్‌ఎస్‌లో 13 వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ రామారావు

పలాస: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. జనన, మరణ సర్టిఫికెట్లు, వీధి దీపాలు మరమ్మతులు వంటి పలు సమస్యలపై 13 వినతులు వచ్చినట్టు మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. టిడ్కో ఇళ్లు గురించి ఎటువంటి అపోహలు వద్దన్నారు. అర్హులైన వారికి త్వరలోనే అందజేస్తామని చెప్పారు. ప్రభుత్వం నుంచి తగిన మార్గదర్శకాలు రావలసి ఉందన్నారు.

డ్రాగన్‌ఫ్రూట్ సాగుతో అధిక ఆదాయం



డ్రాగన్ ఫ్రూట్ తోటను పరిశీలిస్తున్న అధికారులు

మందస: బాహడాపల్లిలో మహిళ రైతు సంఘ సభ్యులు ప్రకృతి వ్యవసాయంలో భాగంగా అధిక ఆదాయంతో పాటు ఔషధ గుణాలున్న డ్రాగన్ ఫ్రూట్‌ను ఆర్గానిక్ పద్ధతిలో సాగుచేస్తున్నారనివెలుగు ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. బహడాపల్లి గ్రామంలో మహిళా రైతు కర్రి పాపమ్మ ఆర్గానిక్ విధానంలో పండిస్తున్న డ్రాగన్ ఫ్రూట్ తోటను సోమవారం పరిశీలించారు. ఎలాంటి ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడకుండా సహజ సిద్ధమైన కంపోస్టు ఎరువుతో పండించడాన్ని చూసి ఆనందం వ్యక్తపరిచారు. ఈ పండ్లను కిలో రూ. 250 నుంచి 300 రూపాయల వరకు అమ్మకం చేస్తున్నారని.. ఫోన్ ద్వారా ఆర్డర్ వస్తున్నట్టు తెలిపారు. వీవోఏ మాధవరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘ ప్రతినిధులు

సోంపేట: ఉపాధ్యాయలను బోధనకే పరిమితం చేయాలని ఏపీటీఎఫ్ ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోంపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలియజేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ బి.అప్పలస్వామికి అందజేశారు. జిల్లా ఉపాధ్యక్ష, కార్యదర్శులు జి.భీమారావు, ఎస్.చాణక్య, రాష్ట్ర కౌన్సిలర్లు జి.రాజేష్, పైడి శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

ఆర్థిక, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- ఆర్థిక విద్యా రంగ సమస్యలపై రణభేరి:



వెంకటేశ్వర్లకు వినతిపత్రం అందజేస్తున్న నందిగాం ఉపాధ్యాయులు

నందిగాం: ఆర్థిక, విద్యారంగంలోని సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ యూటీఎఫ్ తలపెట్టిన రణభేరి జాతా సోమవారం నందిగాం చేరకుంది. పలాసలో ప్రారంభమైన జాతాను పోలీసులు అడ్డుకొని యూటీఎఫ్ నాయకులను అరెస్టు చేయడంతో నందిగాం మండలానికి ఆలస్యంగా చేరుకుంది. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వెంకటేశ్వర్లను మండల సంఘ ప్రతినిధులు స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో కలిసి ఉపాధ్యాయ సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ



పుస్తకాలు అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

వజ్రపుకొత్తూరు రూరల్: పలాస మండలం బ్రహ్మణతర్లాలోని అదర్శ పాఠశాలలో చదువుతున్న వంద మంది విద్యార్థులకు పలాస లయన్స్ క్లబ్ ఆర్థిక సాయంతో నోట్ పుస్తకాలు,పెన్నులు, పెన్సిళ్లను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు సింధూరి మధు మాట్లాడుతూ.. చిన్నారులు విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను అలవర్చుకోవాలని ఈ దశగా విద్యను అభ్యసించాలని అన్నారు. చిన్నారుల విద్యాభివృద్ధికి లయన్స్ క్లబ్ సాకారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ మాజీ అధ్యక్షులు హెచ్‌వై దొర, ప్రతినిధులు అప్పారావు, పీఎంసీ చైర్మన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు



సాక్షి ఎఫెక్ట్...

నిన్న: లతలతో అల్లుకుని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్



నేడు: ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలను తొలగిస్తున్న సిబ్బంది

టెక్కలి రూరల్: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పిచ్చిమొక్కలు, లతలు అల్లుకుని ఉండటంతో తరచూ సరఫరాకు అంతరాయం తలెత్తేంది. దీంతో ప్రజలు ఇబ్బందిపడేవారు. ఈ సమస్యపై 'అల్లుకున్న నిర్లక్ష్యం'శీర్షికతో ఈ నెల 14వ తేదీన 'సాక్షి'లో కథనం వచ్చింది. దీనికి స్పందించి సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం జేసీబీ, కొంతమంది సిబ్బంది సహాయంతో ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఉన్న మొక్కలను తొలగించారు.

ముగిసిన డివిజన్ స్థాయి క్రీడా పోటీలు



కబడ్డీలో తలపడుతున్న బాలికలు

పలాస: బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కబడ్డీ, చెస్ క్రీడా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. పలాస డివిజన్ పరిధిలోని వివిధ మండలాల నుంచి మొత్తం 500 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. ఇందులో కబడ్డీలో బాలబాలికలు 40 మంది, చెస్‌లో 20 మంది ఎంపికయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.వీర్రాజు మాట్లాడుతూ.. విద్యతో పాటు క్రీడల్లో కూడా విద్యార్థులు పాల్గొని ఉన్నత శిఖరాలకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ గర్తం తులసీరావు, సర్పంచి తామాడ మదన్, కిక్కర డిల్లీరావు, కుత్తుం లక్ష్మణరావు, తామాడ త్రిలోచనరావు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు పి.తవిటయ్య, సీహెచ్ పద్మలోచన్, ఎస్.రామారావు, పి.గజేంద్రరావు, ఎంపిక కమిటీ సభ్యులు ఎస్.రమేస్, లోకేశ్వరరావు, జె.నారాయణ, టి.గణేష్, గీత పాల్గొన్నారు.

యూరియా టోకెన్ల కోసం పడిగాపులు



టోకెన్ల కోసం పడిగాపులు కాస్తున్న మహిళా రైతులు

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి బెల్లుపడ రైతు సేవా కేంద్రం వద్ద యూరియా టోకెన్ల కోసం రైతులు సోమవారం పడిగాపులు కాశారు. ఉదయాన్నే కేంద్రం వద్దకు చేరుకున్న రైతులకు సకాలంలో సిబ్బంది టోకెన్లు అందించక పోవడంతో వారంతా ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న అధికారులు అక్కడకు చేరుకొని టోకెన్లను జారీ చేయడంతో రైతులంతా శాంతించారు.



పలా: చినంచలలో టోకెన్ల కోసం వేచిఉన్న రైతులు

చినంచలలో

పలాస: చినంచల గ్రామంలో యూరియా టోకెన్ల కోసం రైతులు ఇబ్బంది పడ్డారు. 500 మంది రైతులకు యూరియా అవసరం ఉండగా కేవలం 118 మందికి మాత్రమే టోకెన్లు ఇచ్చి అధికారులు చేతులు దులుపుకున్నారు. దీంతో అధికారులకు రైతులకు మధ్య వాగ్వాదాలు జరిగాయి. టీడీపీ నాయకులు ఎవరికి చెబితే వారికే టోకెన్లు ఇస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేటితరం ఇంజినీర్లకు ఆదర్శం మోక్షగుండం

టెక్కలి: నేటితరం ఇంజినీర్లకు ఆదర్శం మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని ట్రిపుల్ ఐటీ శ్రీకాకుళం డైరెక్టర్ కె.వి.జి.డి. బాలాజీ అన్నారు. టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీర్స్ డేను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో ఉన్న మోక్షగుండం విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం వివిధ రకాల ప్రాజెక్టులను రూపకల్పన చేసి ప్రజెంటేషన్ చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ డి.విష్ణుమూర్తి, సివిల్ హెచ్‌ఓడీ పి.దినకర్ పాల్గొన్నారు.

పైడిగాం ప్రాజెక్టు అభివృద్ధికి కృషి చేయాలి



ఎమ్మెల్సీ రామారావుకు వినతి పత్రం అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధుల

సోంపేట: మండల పరిధిలోని పైడిగాం ప్రాజెక్టు అభివృద్ధికి కృషి చేయాలని బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నర్తు రామారావును సోమవారం రాత్రి కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. పైడిగాం ప్రాజెక్టు పరిధిలో సోంపేట, కంచిలి, మందస మండలాలకు చెందిన ఐదువేల ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. అయితే ప్రాజెక్టు అభివృద్ధికి నోచుకోక పోవడంతో శివారు ఆయకట్టుకు సాగు నీరు అందడం లేదన్నారు. ఈ విషయమై ఎమ్మెల్సీ రామారావు శాసనమండలిలో చర్చించి పైడిగాం ప్రాజెక్టు అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. తన వంతు కృషిచేస్తానని ఎమ్మెల్సీ వారికి హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీన డిల్లీరావు, ప్రతినిధులు సాహుకారి జాని, దేవరాజు ఉన్నారు.

బోరు బాగు చేయించాలని విజ్ఞప్తి



పాడైన బోరును చూపిస్తున్న వృద్ధురాలు

వజ్రపుకొత్తూరు రూరల్: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పదో వార్డు కోవెల వీధిలోని బోరింగు నాలుగు నెలల క్రితం పాడైంది. దీంతో స్థానికులు నీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. కోవెల వీధి ప్రజలతో పాటు కాశీ విశ్వేశ్వరాలయానికి వచ్చే భక్తులు ఈ బోరు నీటిని వినియోగించేవారు. అలాగే వేసవికాలంలో డెంకి వీధి, కొండవీధి ప్రజల దాహార్తిని కూడా ఈ బోరు నీరే తీర్చేది. అయితే బోరింగు పాడై నాలుగు నెలలు దాటినప్పటికీ మున్సిపల్ సిబ్బంది పట్టించుకోకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బోరును బాగుచేయించి నీటి కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.

17న వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ సమావేశం



మాట్లాడుతున్న నాయకులు

టెక్కలి: జిల్లా కేంద్రం శ్రీకాకుళంలోని బృందావనం కన్వెన్షన్‌లో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ విభాగం సమావేశాన్ని ఈ నెల 17వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆ విభాగంగా రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు జద్యాడ జయరాం, కర్నిక జీవన్, కాళ్ల సంజీవ్, కాళ్ల గణపతిరావు, సోమేశ్వర్రావు తెలిపారు. సోమవారం టెక్కలిలో వారు మాట్లాడుతూ.. సమావేశానికి ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్‌బాబు హాజరవుతారన్నారు. జిల్లాలో గల వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అనుబంధ విభాగాల ప్రతినిధులతో పాటు అదే సామాజిక వర్గానికి చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

ఒడియా గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగానికి దరఖాస్తులు ఆహ్వానం

ఇచ్ఛాపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒడియా సబ్జెక్టు బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 20వ తేదీలోగా కళాశాల కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలన్నారు.

యూరియా సరఫరాపై శ్రద్ధచూపండి



కోటబొమ్మాళిలో గ్రోమోర్ దుకాణం వద్ద యూరియా కోసం రైతులు పడుతున్న కష్టాలను చూపిస్తున్న హేమసుందర్‌రాజు

టెక్కలి: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని విమర్శించడంపై ఉన్న శ్రద్ధ రైతులకు యూరియా ఇవ్వడంపై లేని అసమర్థత మంత్రి అచ్చెన్నాయుడు అని వైఎస్సార్‌సీపీ కోటబొమ్మాళి మండల అధ్యక్షుడు సంపతిరావు హేమసుందర్‌రాజు తీవ్రంగా విమర్శించారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సొంత మండల కేంద్రంలోని గ్రోమోర్ సెంటర్ వద్ద సోమవారం యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తూ ఇబ్బందులు పడిన వైనంపై హేమసుందర్‌రాజు మీడియాతో మాట్లాడారు. యూరియా కోసం రైతులు అష్టకష్టాలు పడుతుంటే వాటిని పట్టించుకోకుండా జగన్‌మోహన్‌రెడ్డిపై నోటికి ఇష్టం వచ్చినట్లు అచ్చెన్నాయుడు మాట్లాడడం తగదన్నారు. రైతులకు యూరియా ఇవ్వడంలో ఘోరంగా వైఫల్యం చెందడంతో మంత్రికి పూర్తిగా మతిపోయిందన్నారు. ఒక వైపు రైతులకు యూరియా ఇవ్వలేని దుస్థితి...మరో వైపు రైతుల పక్షాన పోరాటం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులపై నిర్బంధాలకు గురి చేస్తున్న అచ్చెన్నాయుడుకు ఘోరీ కట్టే సమయం దగ్గర పడిందన్నారు.

కొత్తమ్మతల్లి హుండీల ఆదాయం లెక్కింపు



కోటబొమ్మాళి మండల కేంద్రంలోని కొత్తమ్మతల్లి అమ్మవారికి భక్తులు సమర్పించిన హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కించినట్టు అలయ కార్యనిర్వాహనాధికారి వాకచర్ల రాధాకృష్ణ తెలిపారు. టెక్కలి మండలం రావివలస ఎండలమల్లికార్జున స్వామి దేవాలయ ఈవో జి.గురునాథరావు ఆధ్వర్యంలో హుండీలను తెరిచారు. 85 రోజులకు 4,91,802 రూపాయల ఆదాయం సమకూర్చినట్టు పేర్కొన్నారు. ఆలయ కమిటి చైర్మన్ కోరాడ చిన్నగోవింద్, గ్రామ పెద్దలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

–టెక్కలి రూరల్

సంపద తయారీపై దృష్టి



పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా నియమితులైన సీఆర్పీలు సంపద తయారీపై దృష్టిసారించాలని డిప్యూటీ ఎంపీడీవో ఎల్.వెంకటరావు అన్నారు. ఇటీవల సంతబొమ్మాళిలో శిక్షణ పొందిన సీఆర్పీలతో సోమవారం తన కార్యాలయంలో సమావేశమయ్యారు. గ్రామాల్లో తడి, పొడి చెత్తను సేకరించే క్లాప్ మిత్రలతో ఇంటింటికీ వెళ్లాలన్నారు. సేకరించిన చెత్తను సంపద కేంద్రాలకు తరలించి వాటి ద్వారా సేంద్రియ ఎరువులు తయారు చేసేందుకు కృషి చేయాలన్నారు.

–ఇచ్ఛాపురం రూరల్

మాజీ మంత్రి పరామర్శ



కృష్ణవేణమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అప్పరాజు తదితరులు

పలాస: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి రెండో వార్డు కోసంగిపురం గ్రామానికి చెందిన కింతల కృష్ణవేణమ్మ ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకొని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పలాస నియోజకవర్గం సమన్వయకర్త డాక్టర్ సీదిరి అప్పలరాజు సోమవారం వారి కుటుంబ సభ్యులు మురళీమోహన్ తదితరులను పరామర్శించారు. మృతురాలు కృష్ణవేణమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలాస–కాశీబుగ్గ పట్టణ పార్టీ అధ్యక్షుడు శిస్టు గోపి, మాజీ ఎంపీపీ బత్తిన హేమేశ్వరరావు, సనపల సింహాచలం, బమ్మిడి దుర్యోధనరావు, వాయిలపల్లి శ్రీనివాసరావు, బిరాటి వల్లభరావు, బోనెల రవి, కింతల శివయ్య మాస్టార్, కింతల రాము, రాంబాబు, కిషోర్ ఉన్నారు.

హిందీతో జాతీయ సమైక్యత



ఇచ్ఛాపురం రూరల్: తేలుకుంచిలో నాగేశ్వరరావును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు



మందస: కొత్తపల్లిలో పాపమ్మను సత్కరిస్తున్న సిబ్బంది

ఇచ్ఛాపురం రూరల్: హిందీ మన దేశ జాతీయ భాషని, జాతీయ సమైక్యతను ఇనుమడిపంజేస్తుందని రత్తకన్న, కొళిగాం ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు దేవరాజు, ప్రమీళాకుమారీ అన్నారు. హిందీ భాషా పక్షోత్సవాల సందర్భంగా సోమవారం ఆయా పాఠశాలల హిందీ భాషోపాధ్యాయులు బి.నాగేశ్వరరావు, నరేంద్రనాథ్ పట్నాయక్‌లను ఉపాధ్యాయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హిందీ భాషా ప్రచారకులు నిరంజన్ ఖడంగా తదితరులు పాల్గొన్నారు.

మందస: కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో హిందీ దివస్‌ను ప్రధానోపాధ్యాయులు కె.వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. హిందీ ఉపాధ్యాయిని బేపల పాపమ్మను దుశ్శాలువతో సత్కరించారు. అలాగే జి.ఆర్.పురం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం కర్నేన రమణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయిని వజ్జ నాగశిరీషను సిబ్బంది సత్కరించి అభినందించారు.

ఘనంగా హిందీ వారోత్సవాలు

ఇచ్ఛాపురం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మున్సిపల్ ఉన్నత పాఠశాలలు, ఆదర్శ పాఠశాలలు, కేజీబీవీలో హిందీ దివస్‌ను జరుపుకున్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సూర్యారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హిందీ భాష ప్రాధాన్యతను వివరించారు. హిందీ ఉపాధ్యాయులను సత్కరించారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



పోలవరంలో పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

టెక్కలి రూరల్: పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ఉచితంగా టీకాలను వేస్తున్నామని.. పశు యజమానులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్ పూర్ణచంద్రరరావు తెలిపారు. మండలంలోని హరిపురం, పోలవరం, పిట్టలసరియా, సవర సీతాపురం, రావివలస, పరశురాంపురం గ్రామాల్లో సోమవారం 110 పశువులకు టీకాలు చేసినట్టు పేర్కొన్నారు. ఈ వ్యాధి బారిన పడిన పశువులలో అధిక జ్వరం, నోటిలో, కాలి గిట్టల మధ్యలో పుండ్లు, నోటి నుంచి చొంగ కారడం, పాల దిగుబడి తగ్గడం మొదలగు లక్షణాలు కనిపిస్తాయని అన్నారు. వీటి నివారణ కోసం అక్టోబర్ 15 వరకు టీకాలు వేసే ప్రక్రియను చేపడుతున్నామన్నారు.

కోటబొమ్మాళి మండలంలో..

కోటబొమ్మాళి మండలం నిమ్మాడ, నారాయణవలస తదితర గ్రామాల్లో 231 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్ తెలిపారు. మండలానికి సంబంధించి 12,100 గాలికుంటు టీకాలు అందుబాటులో ఉన్నాయని.. పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.